క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మొయినాబాద్: మండలంలోని కేతిరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ హమునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, సజ్జన్‌పల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

మొయినాబాద్ మండలంలోని విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఏఈ హమునాయక్ పేర్కొన్నారు. ఇటీవల అకాల వర్షాలు, ఈదురుగాలుల వల్ల దెబ్బతిన్న విద్యుత్ లైన్లు పునరుద్ధరించామని..ఎక్కడా సమస్య తలెత్తినా వెంటనే తమ సిబ్బంది స్పందిస్తున్నారన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని కొడిచర్ల గ్రామంలో ఆదివారం ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని బీసీ కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.. 10 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌యాదవ్, శివశంకర్‌రెడ్డి,నవీన్, సరిత, నర్సింహ్మారెడ్డి, మోహన్‌రెడ్డి, జంగయ్యయాదవ్, దశరథ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని హెరిటేజ్ ప్యాలెస్‌లో స్మార్ట్ కిడ్స్ లర్నింగ్ అకాడమీ కిస్మత్‌పూర్ ఆధ్వర్యంలో ఆదివారం అబాకస్ స్టేట్ లెవల్ 2023 చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఫౌండర్ వై.మల్లికార్జున్ రావు, కాకతీయ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ హరి ప్రకాష్ పోటీలను ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన 500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వివిధ కేటగిరిలో విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ట్రోఫీలను అందజేశారు.

ఆతిథ్య రంగంలో హైదరాబాద్ టాప్

నోవాటెల్ జనరల్ మేనేజర్ సుఖ్‌వీర్‌సింగ్

శంషాబాద్: ఆతిథ్య రంగంలో హైదరాబాద్ నగరం అగ్రస్థానంలో ఉందని శంషాబాద్ ఎయిర్‌పోర్టు నోవాటెల్ హోటల్ జనరల్ మేనేజర్ సుఖ్‌వీర్‌సింగ్ అన్నారు. ఆదివారం హోటల్‌లో బీ–జిన్ పేరిట ఏర్పాటు చేసిన వేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పర్యాటకులు, వినియోగ దారులను ఆకట్టుకునేలా హోటల్‌ను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పర్యాటకుల అభిరుచికి తగిన ఆహారపదార్థాలు, బ్రివరేజేస్ అందించేందుకు నోవాటెల్‌లో ప్రముఖ మిక్సాలజిస్టులను ఏర్పాటు చేసుకుంటుందన్నారు. బీ–జిన్‌లో ప్రముఖ మిక్సాలజిస్ట్ రోహన్ జెల్కీ తన ప్రత్యేకతను చాటుతున్నారన్నారు.

శాలివాహన సంఘం కమిటీ ఎన్నిక



కమిటీతో శాలివాహన సంఘం నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ శాలివాహన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గం శాలివాహన సంఘం అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి ఆధ్వర్యంలో ఎన్నుకున్న కమిటీని ఆదివారం ప్రకటించారు. ఆ గ్రామ శాలివాహన సంఘం అధ్యక్షుడిగా జాపాల శివకుమార్, గౌరవాధ్యక్షుడిగా జాపాల శ్రీరాములు, యూత్ ప్రెసిడెంట్‌గా జాపాల జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడిగా జాపాల మహేందర్, జాపాల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీలుగా జాపాల శివశంకర్, జాపాల కిషన్, కార్యదర్శులుగా జాపాల ప్రశాంత్, సురేష్, రవి, కోశాధికారిగా జాపాల దశరథ్, సభ్యులుగా జాపాల కుమార్, శ్రీకాంత్, వెంకటేష్, యాదయ్య, నరసింహ, పాండు, దానయ్యలను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల యూత్ ప్రెసిడెంట్ ఎగిరిశెట్టి నరేష్, వైస్ ప్రెసిడెంట్ సందీప్ కుమార్, ఎగిరిశెట్టి వంశీధర్ పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ట్రాక్టర్‌కు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు విక్రయం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



నాగరగూడ ఈసీ వాగులో నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు

షాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. తిమ్మారెడ్డిగూడ, ఏట్ల ఎర్రవల్లి, తాళ్లపల్లి, చందనవెల్లి, రుద్రారం, హైతాబాద్, సోలీపేట్ తదితర గ్రామాల మీదుగా ఈసీవాగు ప్రవహిస్తుంది. ఈ వాగులో నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ట్రాక్టర్ ఇసుక రూ.2వేల నుంచి 3వేల వరకు విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని రెవెన్యూ పంచాయతీ కార్యదర్శులు ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుడండంతో వాగులు పెద్ద పెద్ద గోతులు, గుంతలమయంగా తయారై ఏడారిని తలపిస్తున్నాయి. షాబాద్ మండలంలోనే కాకుండా చుట్టూ పక్కల మండలాలకు కూడా స్థానిక వ్యాపారులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారు. మండలశాఖ అధికారులు తమ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు కూడా ఇసుక తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వకున్నా వ్యాపారులు తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను కట్టడిచేసే బాధ్యతను పోలీస్‌శాఖ నుంచి రెవెన్యూశాఖకు అప్పగించడంతో వారిని ఎవరూ ఆపడం లేదు. వాగులు ఏడారిగా మారిపోవడంతో ప్రస్తుతం నామమాత్రంగా పని చేస్తున్న బోరుబావులు సైతం ఎండిపోయే దశకు చేరుకున్నాయి. మండల అధికారులు వెంటనే స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులేం చేస్తున్నట్లు...?

పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల కళ్ల ముందు నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్న ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఎవరైనా ఇసుకపై అధికారులను ప్రశ్నిస్తే లిఖిత పూర్వకంగా తమకు రాసి ఇస్తేనే చర్యలు తీసుకుంటామని, తమ దృష్టికి రానప్పుడూ ఎలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.



ఈసీ వాగులో తవ్విన గుంతలు

చర్యలు తీసుకుంటాం...



ఈసీ వాగులో నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. అలాంటి వారిపై నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తాం.మండలంలోని ఏ గ్రామంలోనైనా వాగుల్లో నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న సమయంలో మాకు సమాచారం ఇవ్వండి.. ట్రాక్టర్లను సీజ్ చేసి వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– గురువయ్యగౌడ్, సీఐ షాబాద్

దేశానికి దిక్సూచి తెలంగాణ

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్‌రూరల్: సంక్షేమ పథకాల అమలులో దేశానికి దిక్సూచి తెలంగాణ అని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల బీఆర్ఎస్‌పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని హాజిపల్లి గ్రామ శివారులోని ఏవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అన్నారు. తద్వారా రాష్ట్రం అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు. ఎవరు ఊహించని రీతిలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని వివరించారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల నేతలు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీల నేతల మోసపూరిత మాటలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు నరేందర్, విశ్వం, ఇద్రీస్, వెంకట్‌రాంరెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మణ్‌నాయక్, లక్ష్మీనర్సింహ్మారెడ్డి, మల్లేష్, బక్కన్న యాదవ్, ప్రకాష్‌గౌడ్, బుజ్జిబాబు నాయక్, రాజావరప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాలయానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ తదితరులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని కురువగూడ గ్రామ సర్పంచ్ సంధ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కురువగూడా గ్రామంలో మల్లన్న దేవాలయానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో దేవాలయాలు నిర్మించి ప్రజలను ఆధ్యాత్మికత వైపు మళ్లించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు నిష్ఠతో పూజలు చేస్తే మంచి జరుగుతుందన్నారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఐదు సంవత్సరాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, అండర్ డ్రైనేజీలు నిర్మించామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ధర్మభిక్షంకు ఘన నివాళి



బొమ్మగారి ధర్మబిక్షం వర్ధంతిలో నాయకులు

చేవెళ్ల: దున్నేవాడిదే భూమి, గీసేవాడిదే చెట్టు అనే నినాదాలతో స్వతంత్ర్య సమరయోధుడు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు బొమ్మగారి ధర్మభిక్షం అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, గీత పనివాళ్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో బొమ్మగారి ధర్మబిక్షం 12వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధర్మభిక్షం జీవితాన్ని బడుగు బలహీన వర్గాల కోసం, గౌడ సంఘం అభివృద్ధికి త్యాగం చేశారన్నారు. వీరంతా ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని అకాంక్షించిన మహానాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు. గ్రామ గ్రామాన గీత పనివాళ్ల సంఘాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు. పేద ప్రజల సమస్యలపై పోరాడినట్లు తెలిపారు. అలాంటి నాయకులను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, గీతా పనివార్ల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కృష్ణగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, నాయకులు శివయ్య, శ్రీనివాస్, మంజుల, మాధవి, సాయిలమ్మ, లత, రమేశ్, తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవ అవార్డులకు ఎంపిక



అవార్డుకు ఎంపికైనట్లు పత్రాలు అందజేస్తున్న రాధాకృష్ణ

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పల్లె స్వాతి బాలీశ్వర్ ఉత్తమ సర్పంచ్‌గా, పల్లె ఆనంద్‌కుమార్‌కు ఉత్తమ సేవారత్న జాతీయ అవార్డులకు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ వారు వివిధ రంగాల్లో సేవాలను చేస్తున్న వారిని గుర్తించి జాతీయ అవార్డులు అందిస్తోంది. అందులో భాగంగా కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ స్వాతి బాలీశ్వర్, పల్లె అనంద్‌కుమార్‌లు గ్రామానికి చేసిన సేవలను గుర్తించి జాతీయ అవార్డులను అందించినట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ తెలిపారు. అవార్డులు పొందిన వారు ప్రజలకు మరింత సేవలను అందించాలని ఆయన కోరారు. సర్పంచ్ స్వాతి బాలీశ్వర్, అనంద్‌కుమార్‌లకు జాతీయ అవార్డులు రావడం పట్ల గ్రామ ఉప సర్పంచ్ శివకుమార్, మల్లేష్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, బాలరాజ్, రాజు, సూరం శేఖర్, కుమారస్వామి గుప్త, శివకుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

పీడీఎస్‌యూలో పలువురి చేరిక



పీడీఎస్‌యూ సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

చేవెళ్ల: విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న ప్రగతి శీలా ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ)పై నమ్మకంతో ఇతర సంఘాల నాయకులు పీడీఎస్‌యూ వైపు వస్తున్నారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేశ్ అన్నారు. మండలకేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆదివారం మండలంలోని ఎస్ఎస్‌యూఐ విద్యార్థి సంఘానికి చెందిన నాయకులు అభిషేక్, ప్రణీత్‌లు పీడీఎస్‌యూలో చేరారు. వారికి పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం సభ్యత్వం అందించి సంఘంలో చేర్చుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్యా విధానం కోసం, ప్రైవేట్ యూనివర్సిటీలకు వ్యతిరేకంగా అనేక ఆందోళన కార్యక్రమాలు చేస్తూ పీడీఎస్‌యూ ముందుకు వెళ్తుందన్నారు. పీడీఎస్‌యూలో చేరిన వారికి స్వాగతం పలుకుతూ తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు జైపాల్ ఉన్నారు.

లయన్స్‌క్లబ్ ఉప గవర్నర్ ఎన్నిక



డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

కందుకూరు: లయన్స్‌క్లబ్ జిల్లా 320ఏ రెండో ఉప గవర్నర్‌గా ప్రముఖ వైద్యుడు, లయన్స్‌క్లబ్ కందుకూరు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో జరిగిన 320ఏ జిల్లా ఏడవ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన ఎన్నికల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. ఇదిలా ఉండగా.. డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి కందుకూరు మండలంలో ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు, రక్తదాన శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమున్న వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించినట్లు స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బీఆర్ రాంరెడ్డి, రీజియన్ చైర్మన్ అంజయ్య, జోన్ చైర్మన్ రాంరెడ్డి, సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ చెన్నకిషన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, మాజీ అధ్యక్షులు సత్యనారాయణ, కొండల్‌రెడ్డి, కేశవరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, వెంకట్‌రంగారెడ్డి, కృష్ణరామ్ భూపాల్‌రెడ్డి, సభ్యులు డాక్టర్ సుగుణాకర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, అంజిరెడ్డి, వెంకటేశ్‌గుప్తా, రామన్‌బాబు, లచ్చయ్య తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



రన్నర్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చేవెళ్ల: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని వారిలోని ప్రతిభను వెలికితీయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండలకేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో గత నెలరోజులకుపైగా కొనసాగిన కాసుల బాబయ్యగౌడ్, కాసుల జ్ఞానేశ్వర్‌గౌడ్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో ఊరేళ్ల, కేసారం జట్లు పోటీపడ్డాయి. ఈపోటీలో కేసారం జట్టుపై ఊరేళ్ల జట్టు విజయం సాధించింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ ఎం. విజయలక్ష్మిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విన్నర్, రన్నర్ టీంలకు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. ఓటమి గెలుపునకు పునాది పడుతుందని చెప్పారు. గ్రామీణా క్రీడాకారులు బాగారాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు గ్రామీణ క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. వాటిని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ పోటీలో మొదటి బహుమతి సాధించిన ఊరేళ్ల విజేత జట్టుకు రూ.55,555 నగదు, షీల్డ్. రెండవ బహుమతి కేసారం జట్టు రూ.33,333నగదు, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, నాయకులు మర్పల్లి క్రిష్టారెడ్డి, శివకుమార్, కాసుల రాముగౌడ్, నాగరాజు, రాఘవేందర్‌గౌడ్, ఊరేళ్ల ఉప సర్పంచ్ విఠలయ్య, లక్ష్మణ్‌గౌడ్, అంజయ్య, యాదయ్య, గని, కేసారం, ఊరేళ్ల నాయకులు, నిర్వాహకులు, యువకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రముఖ సాహితీవేత్త భాస్కరయోగిలు అన్నారు. మండలంలోని గొల్లగూడ గ్రామంలో ఆదివారం సాందీప గురు మందిర వార్షికోత్సవంతో పాటు సచ్చిదానంద సాయానార్యుల వార్షికారాధన పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ పూజలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రముఖ సాహితీవేత్త భాస్కయోగిలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, రాష్ట్రాలకు చెందిన భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేన వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడువాలన్నారు. గురుమందిరం ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతి గ్రామానికి విస్తరించాలని సూచించారు. గొల్లగూడలో నాగుల వెంకటేశం గురుపూజ కార్యక్రమాలతో గ్రామానికే గుర్తింపు తీసుకురావడంతో పాటు ఈప్రాంతంలోని ప్రజలకు ఆధ్యాత్మికతను దగ్గర చేసినట్లు తెలిపారు. భాస్కర యోగి అచల సిద్ధాంతం గురించి భక్తులకు వివరించారు. గొల్లగూడ గ్రామంలో గురు మందిర వార్షిక పూజా కార్యక్రమంతో ఆధ్యాత్మిక గ్రామంగా మారిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గురుపూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో అలరించారు. ఈ పూజల్లో సేవా సమాఖ్య కేంద్ర ఉపాధ్యక్షుడు దాయనంద్, వెంకట్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన యాదవ్ రమణ, కర్ణాటకకు చెందిన రవిచంద్ర, ఏలూరుకు చెందిన నిత్యనంద, చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు మర్పల్లి క్రిష్టారెడ్డి, గోపాల్ రెడ్డి, బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, సర్పంచ్ రాం చంద్రయ్య కమ్మెట సర్పంచ్ తులసి రాజు, పలుపార్టీల నాయకులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

ఏజీవర్సిటీ: శ్రీకొండ లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం విద్యార్థి ఆసిఫుల్లా బేగ్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 27 నుంచి 31 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని బన్సార పట్టణంలో ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో 28 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆసిఫుల్లాబేగ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతడిని విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ చిన్ననాయక్ అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. క్రీడాకారులకు వర్సిటీ అన్ని విధాల అండగా ఉంటుందన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి

బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్



ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభిస్తున్న శివకుమార్

తుక్కుగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్ చెప్పారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 4వ వార్డులో ఆయుష్మాన్ భారత్ పథకంలో పేర్ల నమోదు కార్యక్రమం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయుష్మాన్ పథకంలో చేరిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత బీమా సౌకర్యం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ ఉప్పు నూతల యాదయ్య, వెంకటాచారి, రవీందర్, కుమార్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు సమ్మేళనం



షాబాద్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

షాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం మండలంలోని ఓ రిసార్ట్స్‌లో కలుసుకున్నారు. మొత్తం 180 మంది విద్యార్థులకుగాను 100 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా ఒకరినొక్కరు అప్యాయంగా పలకరించుకొని పరిచయం చేసుకున్నారు. ఒకొక్కరు ఒక్కో రంగాల్లో స్థిరపడినట్లు తెలిపారు. 20 ఏళ్ల తరువాత చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం సంతోషంగా ఉందని, ఎన్ని పనులు ఉన్నా పక్కనపెట్టి స్నేహితులను కలుసుకోవడానికి ఇక్కడికి వచ్చినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఆత్మీయ కలయిక

మొయినాబాద్: సుమారు ముప్పై ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలిశారు. మండల పరిధిలోని పెద్దమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు కలిసి చదువుకున్నవారంతా ఒక్కచోట చేరి నాటి మధుర జ్ఞాపకాను గుర్తుచేసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన అధ్యాపకుడు రాములును ఘనంగా సన్మానించారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్ల తరువాత ఒక్కచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆటపాటలతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



ప్రేమావతిపేటలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజేంద్రనగర్: ఎస్సీ వర్గీకరణ బిల్లు వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని లేని పక్షంలో బీజేపీకి మనుగడ ఉండదని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టనందుకు నిరసనగా ప్రజల మధ్యకు వెళ్లి బీజేపీ చేస్తున్న మోసాలను ఎండగడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రేమావతిపేటలో విద్యార్థి నాయకులు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కులాల వర్గీకరరణ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికి అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఎస్సీలను మోసం చేస్తూ కాలయాపన చేస్తున్నారని, ఇకపై తాము సహించేది లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కార్తీక్ మాదిగ, నరేష్‌మాదిగ, మీసాల గణేష్‌మాదిగ, శివమాదిగ, మద్దిలేటి మాదిగ, శంకర్‌రావు , ఎడ్లకాడి సూర్యం, ఉపేందర్, బర్ల సుమన్, ఎడ్లకాడి చంద్రశేఖర్, బైండ్ల నగేష్, మంగళారం రవి, గడ్డం హరీష్ తదితరులు పాల్గొన్నారు.